క్లుప్తంగా

గోడ విషయమై ఘర్షణ

మైలవరం : మండల పరిధిలోని చిన్నకొమెర్ల గ్రామంలో గోడ సమస్య విషయమై రెండు కుటుంబాలమధ్య ఘర్షణ పడ్డారు. శ్రీదేవి అనే మహిళ తమ కలం వైపు రహదారి కోసం వాకిలి నిలబెడుతున్నారంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో హుటాహుటినా బాధితురాలిని ప్రభుత్వాసుపత్రికి బంధువులు తరలించారు. ఆమె కుమారుడు వినోద్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కారకులైన రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి మరో ముగ్గురుపైన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాగునీటి సమస్యలేకుండా చేస్తాం


నూతన బోరును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. మంగళవారం వెంకటేశ్వర కాలనీ ప్రజలకు తాగునీటి సమస్యలేకండా చేయటానికి నూతన బోరును వేయించారు. అలాగే వెంకటేశ్వర, భాగ్యనగర్ ప్రజలకు తాగునీటి సమస్య ఎక్కువగా ఉండటంతో పెన్నానదిలో మరోబోరు వేయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ సురేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మురికి నీటికుంటలో ఆయిల్స్ బాల్స్ వదులుతున్న ఆరోగ్య కార్యకర్తలు

పులివెందుల రూరల్ : భాకరాపురం, లయోలా కళాశాల దగ్గర నీరు నిలిచిన ప్రదేశాల్లో మంగళవారం దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వదిలినట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శాంతికుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్యలు తెలిపారు. ఆయిల్ బాల్స్‌ను మురుగునీటి కుంటల్లో, వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో, పెద్దపెద్ద మురికి కాలువల్లో దోమల లార్వా (గుడ్లు)ని నివారించేందుకు ఆయిల్ బాల్స్ వేయించామన్నారు. దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తా చెదారాలను మురికి కాలువల్లో వేయకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

లింగాల : స్థానిక దీనబంధు ఆశ్రమంలో మంగళవారం ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రవీంద్రారెడ్డి, పద్మజల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరికి దీనబంధు ఆశ్రమ చైర్మన్ కె.జనార్దన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి తోడ్పాటును అందించాలని ఆయన కోరారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ


పుట్టగొడుగుల శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు

వేంపల్లె : పట్టణంలోని స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టగొడుగులలో అత్యధిక పోషక విలువలు ఉండటం వలన హృదయ రోగులకు, డయాబెటిస్ గల వారికి మంచి ఆహారంగా పుట్టగొడుగులు ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకంపై ఇటువంటి క్షేత్ర పర్యటన చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ ప్రొఫెసర్ చంద్రమతి శంకర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలి

తొండూరు : రైతులు తమ భూ సమస్యలపై గ్రామ రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. మండలంలోని ఇనగలూరులో పంచాయతీ వద్ద మంగళవారం రెవెన్యూ సభ నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు దరఖాస్తుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు ఐదు రకాలుగా ఉన్నాయన్నారు. అవి జాయింట్ ఫీల్డ్ విభజన, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్, విస్తీర్ణంలో వ్యత్యాసం, సర్వేనెంబర్ కొర్లేషన్‌సవరణగా ఉన్నాయన్నారు. ఆర్ఐ ఏసోబు, వీఆర్‌ఓ ప్రసాద్, మండల సర్వేయర్ రాఘవేంద్ర, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ సాగుపై రైతుల ఆసక్తి

- నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా సాగు
- 20వేల ఎకరాలలో సాగవుతుందనే అంచనా
- సాగులో పెరిగిపోయిన పెట్టుబడులు


ఎద్దులతో శనగ పంటను సాగు చేస్తున్న రైతులు

వేముల : ఈ ఏడాది రబీ సాగులో శనగ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది రబీ సాగు రైతులను నిరాశ పరిచింది. సాగుకు అదునులో వర్షాలు లేక, ఆలస్యంగా కురిసిన అరకొర వర్షాలకు శనగ సాగు చేసుకున్నారు. సాగు అనంతరం వర్షాలు లేక దిగుబడులు గణనీయంగా తగ్గిపోయి తీవ్రంగా నష్టాలను చవి చూశారు. రబీ సాగులో అదునులో వర్షాలు కురిసి భూములు పదున్లు కావడంతో శనగ సాగుపై దృష్టి పెట్టారు. ముమ్మరంగా సాగు చేస్తున్నారు. అదునులో పంట సాగు చేస్తుండటంతో రైతులలో హర్షం వ్యక్తమవుతోంది.

సాగులో పెరిగిన పెట్టుబడులు :
శనగ సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. ఎకరాకు రూ.15 వేలకు పైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. రబీ సీజన్‌లో శనగ విత్తనాలు క్వింటా రూ.5 వేలకు మించి ధరలు లేవు. అయితే ఈ ఏడాది విత్తన శనగలు క్వింటా రూ.7 వేలకుపైనే ధరలతో రైతులు కొనుగోలు చేశారు. అంతేకాక సాగు, సేద్యపు ఖర్చులు, విత్తన ఖర్చులు పెరిగాయి. ఎకరాకు విత్తనం వేసేందుకు ట్రాక్టర్లను రూ.800లకు పైనే ఇస్తున్నారు. ఎద్దులతో విత్తనం వేస్తే ఎకరాకు రూ.750లు ఇవ్వాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. అలాగే రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయనే వాదన రైతులలో వినిపిస్తోంది.


శనగ పంట సాగుకు విత్తనాలను, ఎరువులను తీసుకెళుతున్న ట్రాక్టర్

నియోజకవర్గంలో 20వేల ఎకరాలకుపైనే సాగు :
నియోజకవర్గ వ్యాప్తంగా శనగ సాగు ను రైతులు ముమ్మరంగా సాగు చేపట్టారు. నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకుపైనే సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మామూలుగా ప్రతి ఏడాది రబీలో నియోజకవర్గంలో 50 వేల ఎకరాలలో శనగ సాగయ్యేది. అయితే ఈ ఏడాది నియోజకవర్గంలో 20వేల ఎకరాలకుపైనే మినుము పంట సాగైంది. దీంతోనే రబీలో శనగ సాగు విస్తీర్ణం తగ్గుతోందని అధికారులు అంటున్నారు. రబీలో శనగ పంటను ప్రధాన పంటగా రైతులు సా గు చేసేవారు. అయితే ప్రతి కూల పరిస్థితులు ఉంటాయనే ఉద్దేశ్యంతో రైతులు మినుము పంటను సాగు చేయడంతో శనగ సాగు తగ్గుతోందని చెప్పవచ్చు.

అదును తప్పుతున్న వర్షాలతో రైతులకు నష్టాలు :
తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే శనగ పంట దెబ్బతింటుందనే ఆందోళన రైతులలో నెలకొంది. అధికంగా వర్షాలు కురిస్తే శనగ పంటకు వేరుకుళ్లు తెగులు సోకి దెబ్బతింటే మళ్లీ శనగ సాగు చేయాలంటే ఖర్చులు రెట్టింపు అవుతాయనే భయం రైతులను వెంటాడుతోంది.

9 ఎకరాలలో శనగ సాగు చేశా



నాకున్న 9 ఎకరాలలో శనగ పంట సాగు చేశా. సాగుకు రూ.1.50 లక్షల మేర పెట్టుబడి పెట్టా. పంట సాగు చేశాక తుఫాన్‌తో వర్షాలు కురిస్తే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాలతో వేరుకుళ్లు తెగులు సోకితే మళ్లీ శనగ సాగు చేసుకోవాల్సిందే. ఇలాంటి పరిస్థితులు వస్తే అదనంగా పెట్టుబడులు అవుతున్నాయి.
– అంకిరెడ్డి, రైతు, గొందిపల్లె

సాగు చేశాక వర్షాలొస్తే నష్టపోతాం



రబీలో శనగ పంట సాగు చేశాక వర్షాలు వస్తే నష్టపోతాం. శనగ పంట సున్నితమైన పంట. అధిక వర్షాలకు తెగుళ్లతో పంట దెబ్బతింటుంది. పంట దెబ్బతిన్న స్థానంలో పంట సాగు వేయాలంటే పెట్టుబడులు రెట్టింపవుతున్నాయి. ప్రతికూల పరిస్థితులలో సాగు చేసిన పంటలు దెబ్బతింటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.
– ఆనందరెడ్డి, రైతు, గొందిపల్లె

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

పులివెందుల రూరల్ : అమరవీరుల త్యాగాలు మరువలేనివని పులివెందుల అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అమరులైన పోలీసులు గురించి సెమినార్ నిర్వహించారు. అనంతరం అమరులైన పోలీసుల త్యా గాల గురించి చెప్పిన విద్యార్థులకు బహుమతుల ను ప్రదానం చేశారు. ఎస్ఐ నారాయణ పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

వేంపల్లె : వైఎస్ఆర్ సభా భవనంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి రైతులకు ప్రొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసిన మొక్కలను నాటి నీరుపోశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీఓ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నారాయణ కళాశాల రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే తాట తీస్తాం


బెల్ట్ షాపుల నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కమలాపురం : కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే తాట తీస్తాం అని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహించే వారికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరైన ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం బెల్ట్ షాపుల పట్ల చాలా సీరియస్‌గా ఉందని, అక్రమంగా మద్యం విక్రయిస్తూ దొరికితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అలాగే మద్యం దుకాణాల నిర్వాహకులతో మాట్లాడుతూ నిబంధనల మేరకు మద్యం విక్రయాలు జరపాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. బెల్ట్ షాపుల మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

లైసెన్సులు కలిగిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలి :
లైసెన్సులు కలిగిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో లైసెన్సులు పొందిన దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. దుకాణాలు ప్రభుత్వ నిబంధల ప్రకారమే ఏర్పాటు చేసి విక్రయాలు జరపాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయించండి

వేంపల్లె : గత ప్రభుత్వంలో మొదలుపెట్టి అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీజేపీ నాయకులు గాలి హరిప్రసాద్ మంగళవారం వేంపల్లికి విచ్చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవిని కలసి విన్నవించారు. రూ.2.20కోట్లతో చేపట్టిన బస్టాండ్ పూర్తి గాక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అక్కడ కనీసం తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ట్రిపుల్‌ఐటికి బస్సు లేక విద్యార్థులు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సర్వీస్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ.1.20 కోట్లతో నిర్మించిన రైతు బజారును ప్రారంభించాలన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శికి సన్మానం

వేంపల్లె : యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన చెరుకూరు శ్రీనివాసులును ఎంఇఓ స్టాలిన్ మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానం చేశారు. ఎంఇఓ మాట్లాడుతూ చెరుకూరి శ్రీనువాసులు ఉపాధ్యాయులుగా పని చేస్తూ యూనియన్‌లో కూడా కీలక బాధ్యతలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఉపాధ్యాయుల పక్షాన నిలపడి పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ప్రోత్సహించేందుకు మెప్మా బజార్


మెప్మా బజార్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు మెప్మా బజార్ దోహదపడుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని మహిళా మార్ట్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసిన పిండి వంటలు, గాజులు, హెయిర్ రిబ్బన్స్, చీరెలు, డ్రస్స్ మెటీరియల్స్, ఆట బొమ్మలు, తినుబండారాల స్టాల్స్ పరిశీలించి వాటి వివరాలను మున్సిపల్ కమిషనర్ రాముడును అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెట్ వసతి కల్పించాలన్న ఉద్దేశ్యంతో మెప్మా బజార్‌ను ఏర్పాటు చేశారన్నారు. తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు లభిస్తాయన్నారు. మెప్మా సీఓ టి.హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని స్టాల్స్ పెంచుతామన్నారు. ప్రతినెలా రెండు రోజులు మెప్మా బజార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, చంద్రమౌళి, కౌన్సిలర్లు, మెప్మా సీఓలు నాగలక్ష్మి, రామాంజనేయులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి


ఉల్లి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి

వీరపునాయునిపల్లె : గోదాములను నిర్మించుకొనేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి తెలిపారు. మంగళవారం మండలంలోని కొమ్మద్ది, వెల్దుర్తి, ఉరుటూరు గ్రామాల్లో ఆమె పర్యటించి ఉల్లి పంట సాగు చేసిన రైతులతో కలిసి వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉల్లి పంటను నిల్వ ఉంచుకొనేందుకు 50 శాతం రాయితీ అందిస్తామన్నారు. ఒక్కో యూనిట్ ధర 1.75 లక్షలు కాగా రైతు వాటా రూ.87.500 చెల్లించవలసి ఉంటుందన్నారు. ధరలు తక్కువగా ఉన్న సమయంలో ఒక్కో గోదాములో 25 మెట్రిక్ టన్నుల వరకు నిల్వ ఉంచుకోవచ్చునన్నారు. అలాగే ఉల్లి పంట సాగుచేసే సమయంలో విత్తన ఎంపికలో రైతులు మెలకువలు పాటించి హైబ్రిడ్ విత్తనాన్ని సాగు చేయవలసినదిగా ఆమె కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి రెడ్డెయ్య, రైతుసేవా కేంద్రాల సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం


బాధిత రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరామిరెడ్డి

కమలాపురం : బెంగళూరు–విజయవాడ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. మంగళవారం ఎక్స్‌ప్రెస్ హైవేకు భూములు కోల్పోయిన బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మండలంలో 35 మంది రైతుల భూముల సమస్యలు ఉన్నాయని, అందులో కొన్ని కోర్టు కేసులు ఉన్నాయన్నారు. కోర్టు కేసులు లేని రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఒకరి పేరు ఉంటే అనుభవంలో మరొకరి పేరు ఉందని, ఈ సమస్యలను పరిష్కరించగానే మీకు పరిహారం అందజేస్తామన్నారు. హైవే నిర్మాణానికి ఎవరూ ఇబ్బందులు పెట్టవద్దని, ఈ నిర్మాణం పూర్తి అయితే మీ భూముల ధరలు పెరుగుతాయని రైతులకు సూచించారు. తహసీల్దార్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు నెంబర్లు కేటాయింపు :
దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో 11 మంది దుకాణాదారులకు లైసెన్సులు మంజూరు అయ్యాయని తహసీల్దార్ తెలిపారు. మంగళవారం వారికి డ్రా తీసి నెంబర్లు కేటాయించారు. టపాసులు అధిక ధరలకు విక్రయించరాదన్నారు. అలాగే నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని, దుకాణాదారుడు మాత్రమే దుకాణంలో ఉండాలన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెడ్మాస్టర్ దయ, తదితరులు

పులివెందుల టౌన్ : రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పులివెందుల సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెడ్మాస్టర్ దయ తెలిపారు. ఈనెల 23వ తేదీన కడప స్పోర్ట్స్ స్కూలులో జరిగిన ఎంపికలలో తమ పాఠశాలకు చెందిన ధనుష్, సంజయ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న జేవీవీ నాయకులు

సింహాద్రిపురం : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కడప వేంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీ నందు నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముఖి సైన్స్ సంబరాల పోటీలలో రావులకొలను జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు పి.జోషిక, ఎస్.అక్షయ, పి.వర్షిక మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని జిల్లా జనవిజ్ఞాన వేదిక కార్యవర్గ సభ్యులు గంగాధరరెడ్డి తెలిపారు. విజేతలైన విద్యార్థులకు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ కందుల చంద్రఓబులరెడ్డి, వేంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వీరసుదర్శనరెడ్డి, చెన్నూరు ఎంఈఓ సునీతలు మెమోంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట కార్యదర్శి లక్ష్మీరాజా, జేవీవీ రాష్ట నాయకులు దేవదత్తం, జిల్లా కార్యదర్శి బాలబయన్న తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల తనిఖీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో మంగళవారం ఉదయం జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ రాముడులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఇంటిలోని వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వకుండా వారి ఇంటి ముందు ఉన్న డ్రైనేజీ చాంబర్‌లో వేయడంవల్ల మురుగునీటి సరఫరాకు తీవ్ర అవరోధం జరుగుతోందన్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా శానిటేషన్ సిబ్బంది చూసుకోవాలన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడండి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

వేంపల్లె : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడంవలన మరొకరి ప్రాణాలను కాపాడడమేకాక శరీరంలో రక్తం మరలా ఉత్పత్తి అవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ శిబిరంలో 100 మందికిపైగా విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. ప్రొద్దుటూరు సర్వజన ఆస్పత్రి డాక్టర్ దిలీప్ వారి సిబ్బంది రక్తాన్ని సేకరించారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామిగుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జె.దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, ఎస్ఐ భాస్కర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జమ్మలమడుగు : డిగ్రీ, ఇంటర్మీడియట్, బీ–ఫార్మసీ వంటి ఉన్నత చదువులు చదువుకుంటున్న విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3,480 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మైలవరంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళంలో భాగంగా టీడీపీ నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ప్రతినెల ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలోనికి వచ్చి ఐదునెలల అవుతున్నా నిధులను విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. అలాగే ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని తాగునీటి పైపులైన్, పారిశుద్ధ్య వాహనాలు కొనుగోలు చేపట్టి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చొరవతో డీఎంఎఫ్ కింద రూ.1 కోటీ నిధులు, ఏఐఐడీ కింద రూ.2 కోట్లు నిధులకు ప్రతిపాదనలు పంపినట్లు తె లిపారు. అలాగే గండికోట రిజర్వాయర్ నుంచి తాగునీటి పైపులైన్ ఏర్పాటుకై ఏఐఐడీ కింద నిధులు రావాల్సివుందన్నారు.

సృజనాత్మకతను వెలికితీయవచ్చు


విజేతలతో ఉపాధ్యాయులు, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు

కమలాపురం : విద్యార్థులకు నిర్వహించే వివిధ రకాల పోటీలు నిర్వహించడం వలన వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని ఎంఈఓ–2 సుభాషిణి తెలిపారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అంశాలపై వ్యాసరచన వకృత్వ తదితర రకాల పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులశమ్మ, ఏకలవ్య ఫౌండేషన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరీ, విద్యా వాహన కోఆర్డినేటర్ వీర నారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐలో మెగా జాబ్ మేళా

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం ఐటీఐ పూర్తి చేసిన 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి చురుకైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, వివిధ కంపెనీల యజమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినుములో రక్షణ పంటలు వేసుకోవాలి


కమలాపురం : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడీఏ రమణారెడ్డి

కమలాపురం : మినుము పంటలో జొన్న, సజ్జ, మొక్కజొన్న తదితర పంటలను రక్షణ పంటలుగా వేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జంబాపురం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మినుము పంటను పరిశీలించారు. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. మినుము పంటలో రక్షణ పంటలుగా జొన్న, సజ్జ, మొక్క జొన్న తదితర పంటలను నాలుగు వరసలుగా తప్పని సరిగా వేసుకోవాలన్నారు. ఏకరానికి 20 చొప్పున పసుపు, లేదా నీలం, లేదా తెలుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించవచ్చన్నారు. అలాగే ఏకరానికి 8 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. పురుగు, లద్దె పురుగులను నివారించవచ్చన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

వరి పంటలో కాలి బాటలు తప్పనిసరి
లింగాల : వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పార్నపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి లాభసాటి వ్యవసాయం చేయాలని.. దానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అలాగే పంటల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి ప్రసన్నకుమారి, పశు వైద్య సహాయకుడు నరేంద్ర, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు
వేముల : శనగ సాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చాగలేరు రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శనగ సాగులో ప్రధానంగా ఎండు తెగులు, వేరుకుళ్ళు తెగులు నివారణకు సస్య రక్షణలు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా మినుము పంటను పరిశీలించి మినుము పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్ లలిత, రైతులు పాల్గొన్నారు.

రైతులు సలహాలు పాటించాలి
ముద్దనూరు : రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించి సాగులో అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. మంగళవారం మండలంలోని కోడిగాండ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ వెంకట సుబ్బయ్య, ఏవో వెంకట కృష్ణారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగివుండి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలని, రబీ పంటల సాగులో పంటల బీమా ప్రీమియం చెల్లింపు వివరాలు త్వరలోనే రైతులకు తెలియజేయనున్నట్లు వారు తెలిపారు.